క్లుప్తంగా

మునేటికి 4992 క్యూసెక్కుల వరద నీరు

వత్సవాయి: మండలంలో బుధవారం 37.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎగువ ప్రాంతాల్లో కూడా వర్షాలు పడుతుండటంతో మునేటికి 4992 క్యూసెక్కుల వరదనీరు వస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈఈ రామనరసింహారావు తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నీరు నిలబడటంతో పత్తి, మిర్చి మొక్కలు వడలి ఎర్రబారిపోయే దశకు చేరుకున్నాయి. ఇప్పటికే పత్తికి, మిర్చికి ఎకరానికి రూ.30వేల వరకు ఖర్చు పెట్టి సాగుచేసిన నేపథ్యంలో మరో రెండు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణశాఖ చెబుతుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మరో నాలుగు రోజులు ఇదేవిధంగా కురిస్తే ఇక ఆ పంటలు చేతి కిరాకుండా పోతాయని ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షానికి పత్తి పంటలో నిలిచిన నీటిని బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి వి.రవికుమార్ సూచించారు. అధిక తేమ నుంచి త్వరగా పంట బయటపడాలంటే ఎకరానికి ఒక బస్తా యూరియా చల్లుకోవాలని సూచించారు.

అధ్వానంగా ముచ్చింతాల రోడ్డు



పెనుగంచిప్రోలు: మండలంలోని ముచ్చింతాల రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు మొత్తం పెద్దపెద్ద గుంతలు పడటంతో ఇందులో వర్షపు నీరు చేరి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వర్షపునీరు ఉన్నప్పుడు గుంతల విషయాన్ని గమనించక పలువురు వాహనదారులు ప్రమాదాల బారినపడి గాయాలపాలయ్యారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు అవతల కాజ్‌వే పక్కన తువ్వకాలువపై ఓ లారీ పక్కకు ఒరిగిపోయింది. అమ్మవారి భక్తులతో వచ్చిన లారీ తువ్వకాలువలోకి ఒరుగుతుండటంతో గమనించిన భక్తులు ఒక్కసారిగా కేకలు వేశారు. దీంతో లారీ డ్రైవర్ అప్రమత్తమై వెంటనే లారీని ఆపి వాహనం నుంచి ఒక్కొక్కరిగా అందరినీ కిందకు దించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని భక్తులు ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం లారీని రోడ్డు మీదకు చేర్చారు.

ఘనంగా గోదాదేవి తిరునక్షత్ర వేడుకలు



నందిగామ టౌన్: పట్టణంలో వేంచేసియున్న సీతారామాంజనేయస్వామి వారి ఆలయంలో గోదాదేవి అమ్మవారి తిరునక్షత్ర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా తులసీవనంలో జన్మించిన గోదా అమ్మవారి ఉత్సవం, ప్రత్యేకాలంకరణలు, విశేష అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆండాళ్ గోష్టి సభ్యుల నాంచార్‌తిరువాయిముడి, తిరుప్పావు పారాయణం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో అర్చకులు, ఆండాళ్ గోష్టి సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్

నవాబుపేట(పెనుగంచిప్రోలు): మండలంలోని నవాబుపేట గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గింజుపల్లి శ్రీనివాసరావుపై గత శనివారం రాత్రి దాడి జరిగిన విషయం పాఠకులకు విదితమే. ఈ ఘటన నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి అల్లర్లు, ఘర్షణలు చోటుచేసుకోకుండా 60 మంది పోలీసులు మూడు షిఫ్టుల్లో గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

కుండపోతగా వర్షం

- రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు..
- పొంగిన వాగులు
- నీటమునిగిన పొలాలు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం



కంచికచర్ల మండలం కీసరు మున్నేటికి చేరిన వరదనీరు

కంచికచర్ల : నందిగామ డివిజన్‌లో బుధవారం 210.0మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెరపి లేకుండా కుండపోతగా వర్షం కురుస్తుండటంతో వాగులు వంకలు పొంగిపొర్లాయి. కొన్నిప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కంచికచర్ల మండలంలోని కీసర మున్నేటికి వరదనీరు భారీగా చేరగా, కంచికచర్ల నుంచి చెవిటికల్లు వెళ్లే రోడ్డుపై లక్ష్మయ్య వాగు పొంగిపొర్లుతోంది. దీంతో ఈ మార్గంలో ప్రజల రాకపోకలు స్తంభించాయి. కంచికచర్ల మండలంలోని మోగులూరులో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు డొంక కాలువ కట్ట తెగి ఎస్సీకాలనీలో ఇళ్లలో నీరు చేరింది. దీంతో ఆ కాలనీ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. డివిజన్‌లోని కంచికచర్లలో మండలంలో 36.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకాగా, నందిగామలో 26.4, చందర్లపాడులో 34.6, వీరులపాడులో 16.2 జగ్గయ్యపేటలో 27.2, పెనుగంచిప్రోలులో 31.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గొట్టుముక్కలలో ఓ కౌలురైతు సాగుచేసిన మొక్కజొన్న పంటకు వేరుకుళ్లు ఆశించడంతో ఆ పొలాన్ని దున్నేశాడు. గొట్టుముక్కల, కంచికచర్ల, పరిటాల, గండేపల్లి, పేరకలపాడు, మోగులూరు, పెండ్యాల తదితర గ్రామాల్లో పంటలు నీట మునిగాయి.

స్తంభించిన జనజీవనం..

పెనుగంచిప్రోలు: రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెనుగంచిప్రోలు మండలంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లింగగూడెం వద్ద గండివాగు పొంగటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ముచ్చింతాల–తాళ్లూరు మధ్య, గుమ్మడిదుర్రు వద్ద వరద నీటికి వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో చప్టాలపై పెద్దఎత్తున నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. అనిగండ్లపాడు వద్ద దూళ్లవాగు వరద నీటితో పక్కన ఉన్న వరి పొలాలు నీట మునిగాయి. అలాగే పత్తి సాగు చేసిన పొలాల్లో వర్షపు నీరు చేరి చిన్నపాటి వాగులను తలపిస్తున్నాయి. అసలే వర్షాలకు నీరు నిలిచి పత్తిచేలు ఎర్రబడిపోతున్నాయి. ఈక్రమంలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో ఈఏడాది నష్టాలు తప్పవని పత్తిసాగు రైతులు దిగాలు చెందుతున్నారు. వర్షాల కారణంగా పొలాల్లోకి దిగే పరిస్థితి లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎగువన తెలంగాణలోని ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు మునేరుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కంచికచర్ల మండలం మోగులూరులో డొంక కాలువ కట్ట తెగటంతో ఇళ్లలోకి చేరిన వరదనీరు



లింగగూడెం గండివాగు వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



మునేరుకు వస్తున్న వరద నీరు



పెనుగంచిప్రోలు వద్ద వాగులను తలపిస్తున్న పత్తి చేలు

జగ్గయ్యపేటలో రోడ్లన్నీ జలమయం

జగ్గయ్యపేట అర్బన్: రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరపిలేని వర్షాలతో జగ్గయ్యపేట పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల రోడ్లపైకి నీరు చేరటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. డ్రెయిన్లు పొంగి రోడ్లపైకి నీరు చేరటంతో వాహనదారులకు అవస్థలు తప్పలేదు. కొద్దిసేపు కూడా విరామం లేకుండా జడివాన కురుస్తుండటంతో అత్యధిక మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. తప్పనిసరిగా బయటకు వెళ్లవలసిన వారు గొడుగులు, రెయిన్‌కోట్లు, స్వెట్లరు ధరించి వెళ్లక తప్పని పరిస్థితి. ఇక పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా వర్షం దెబ్బకు తడిసి ముద్దయ్యారు. ముఖ్యంగా జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ రోడ్డు, కోదాడ రోడ్డు, ఆర్టీసీ డిపో సెంటర్, పాత ఎస్ఎస్‌పీ కాలనీ రోడ్‌లో ట్రాన్స్‌కో ఇండోర్ సబ్‌స్టేషన్ తదితర పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్డుపై వర్షపు నీరు చేరడంతో జనం ఇబ్బందిపడ్డారు.



వర్షం ధాటికి ఇబ్బందిపడుతున్న విద్యార్థులు



పేటలోని డిపో సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పొంగి పొర్లుతున్న వైరా కట్టలేరు

నందిగామ టౌన్: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు దాములూరు కూడలి సమీపంలోని వైరా–కట్టలేరు పొంగిపొర్లుతోంది. వర్షాలకు తోడు ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తోంది. దీంతో దాములూరు కూడలి వద్దనున్న కాజ్‌వే పైనుంచి వరద నీరు నాలుగు అడుగుల మేర ప్రవహిస్తుండటంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బయటికి వచ్చేందుకు వీలులేక నందిగామ పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులుపడ్డారు.



దాములూరు కూడలి వద్ద కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు



చెవిటికల్లు వద్ద పొంగిపొర్లుతున్న లక్ష్మయ్య వాగు

కృష్ణా పరివాహక ప్రాంతాలు అప్రమత్తం

- పులిచింతల నుంచి భారీగా వరద..
- మునిగిన ముక్తేశ్వర స్వామి వారి ఆలయం



రావిరాల ఘాట్ వద్ద కాపలా ఉన్న రెవెన్యూ సిబ్బంది



పులిచింతల నుంచి దిగువకు ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ



వేదాద్రిలో పుష్కర ఘాట్‌లను తాకిన వరద నీరు

జగ్గయ్యపేట: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో మండలంలోని ముక్త్యాల గ్రామ సమీపంలోని పులిచింతల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో రెండోరోజు బుధవారం ప్రాజెక్టు నుంచి 13 గేట్‌ల ద్వారా 2.89 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో కృష్ణానది పరివాహక గ్రామాలైన ముక్త్యాల, వేదాద్రి, రావిరాల గ్రామాల్లో కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆయా గ్రామాలలోని పుష్కర ఘాట్‌లు పూర్తిగా మునిగాయి. ఆయా గ్రామాల ప్రజలను పోలీస్, రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. అంతే కాకుండా మత్స్యకారులను నదిలోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. ముక్త్యాల కృష్ణానది ఒడ్డునున్న భవానీ ముక్తేశ్వర స్వామి వారి ఆలయం పూర్తిగా మునిగిపోయింది. జగ్గయ్యపేట ఇన్‌చార్జి తహసీల్దార్ నాగరాజు వేదాద్రి వద్ద కృష్ణమ్మ వరద పరిస్థితిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు

ప్రభుత్వాస్పత్రి సూపరిండింటెంట్ డాక్టర్ హరీష్

జగ్గయ్యపేట అర్బన్ : తల్లిపాలలో వ్యాధి నిరోధకశక్తి ఉంటుందని, తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రి సూపరిండింటెంట్ డాక్టర్ ఆళ్ల హరీష్ సూచించారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు వేడుకలు బుధవారం స్థానిక వాగ్దేవి నర్సింగ్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులతో తల్లిపాల ప్రాధాన్యత, కలిగే ఉపయోగాలను వివరిస్తూ వివిధ నమూనాల రూపంలో ప్రదర్శించారు. ఈసందర్భంగా డాక్టర్ హరీష్ మాట్లాడుతూ ముఖ్య అతిథిగా పాల్గొని తల్లిపాల విశిష్టతను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సీతామహాలక్ష్మి, అనంత లక్ష్మి, లక్ష్మీకాంతమ్మ మాట్లాడుతూ బిడ్డకు ఆరునెలల వయస్సు వచ్చేవరకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు. బిడ్డ జన్మించిన వెంటనే ఇచ్చే ముర్రుపాలు చాలా శ్రేష్టమైనవని దీనిలో ఎన్నో పోషక విలువలు ఉన్నాయన్నాయని పేర్కొన్నారు. అనంతరం తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు బుస్సా సురేష్, సరిత, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవాల ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి హరీష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు

బాధితుల కోసం విరాళాల సేకరణ

నందిగామ టౌన్: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులకు ఆదుకునేందుకు అందరూ విరాళాలు అందజేయాలని సీపీఎం నాయకులు కటారపు గోపాల్ కోరారు. వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు ఆ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం విరాళాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ వయనాడ్ ప్రజల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందన్నారు. పార్టీ పిలుపు మేరకు నందిగామలో విరాళాలు సేకరిస్తున్నామన్నారు. బాధితులను ఆదుకునేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపీనాయక్, నారాయణ, షేక్ హుస్సేన్, చనుమోలు మొగిలమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.



నందిగామలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

భక్తులారా జర భద్రం...



వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్య క్షేత్రం యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఘాట్ వద్ద భక్తులు స్నానం చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని ఆలయ అధికారులు అంటున్నారు. ఆలయ సమీపంలోని నదిలో ఉన్న సాలాగ్రామ నరసింహ స్వామి వద్ద లోతు ఎక్కువగా ఉంటుంది. స్నానం చేయటానికి వచ్చే భక్తులు సరదాగా నరసింహ స్వామి వద్దకు వెళుతుంటారు. అక్కడ లోతు ఎక్కువగా ఉండటంతో మృత్యువాత పడుతుంటారు. అధికారులు ఆ ప్రాంతం వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని వేదాద్రి గామస్తులు చెబుతున్నారు.

ప్రతిఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి: బీజేపీ

నందిగామ టౌన్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. జాతీయ జెండాలను ఎగరవేయడంపై పట్టణంలోని పలు దుకాణాల యజమానులకు బీజేపీ నాయకులు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13, 14, 15 తేదీలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా త్రివర్ణ పతాకాలతో విద్యార్థులతో ర్యాలీలు చేయించాలని విద్యా సంస్థల యాజమాన్యాలను కోరినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు తొర్లికొండ సీతారామయ్య, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, మునగంటి కామేశ్వరరావు, ఉడతా శ్రీధర్, మురుమూరి శివ, వందేమాతరం అశోక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వర్షపు నీరు డ్రెయిన్లలోకి మళ్లింపు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతోపాటు ప్రధాన రోడ్లపై వర్షపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు వెంటనే వర్షపు నీరు తొలగింపు చర్యలు చేపట్టారు. మున్సిపల్ సిబ్బందిని అప్రమత్తం చేసి వివిధవార్డులతోపాటు పలు రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని తొలగింపు పనులను ముమ్మరం చేశారు. వర్షపు నీటిని సమీపంలోని డ్రెయిన్లలోకి మళ్లించారు.

చేనేత కార్మికులకు ఘనసత్కారం

జగ్గయ్యపేట అర్బన్: చేనేత కార్మికులకు రాష్ట్రప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తూ అండగా ఉంటుందని మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కార్యాలయంలో పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం చేనేత కార్మికులకు ఘనంగా సత్కరించారు. పట్టణానికి చెందిన చేనేత కార్మికులు గుడిపూడి కృష్ణమూర్తి, గంజి కొండ, బెండడి సోమయ్య, మోరం పుల్లారావు, చిట్టిప్రోలు వీరభద్రం, కొండూరు పెంటయ్యలను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు, ఏపీ పద్మశాలీ సాధికార కమిటీ డైరెక్టర్ మేకా వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, మున్సిపల్ కౌన్సిలర్ సంగెపు బుజ్జిబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పొట్టాబత్తిన గంగాధర్, సంఘ 18వ వార్డు అధ్యక్షుడు గోంగూర నాగేశ్వరరావు, చేనేత సంఘ ప్రతినిధులు గోసిగ శ్రీను, పున్న ఈశ్వర్, తుమ్మ నాగరాజు, పొట్టాబత్తిన నాగేశ్వరరావు, చేరుపల్లి నాగరాజు, మోతుకూరి మురళి పాల్గొన్నారు.




చేనేత కార్మికులను సన్మానిస్తున్న శ్రీరాం సుబ్బారావు, టీడీపీ నాయకులు

ఎమ్మెల్యే సౌమ్యకు సన్మానం

జయంతి(వీరులపాడు): మండలంలోని జయంతి గ్రామం సెవెంత్ డే చర్చి ఆధ్వర్యంలో నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా చర్చి నిర్వాహకులు మాట్లాడుతూ చర్చి నిర్మాణానికి నిధుల కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నందున, ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ చర్చి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు భరత్‌రెడ్డి, గువ్వల సత్యనారాయణ, రమేష్, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వేదాద్రి పాఠశాల తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి మహేశ్వరరావు

వేదాద్రి(జగ్గయ్యపేట): మండల ప్రత్యేకాధికారి మహేశ్వరరావు వేదాద్రిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. పలువురు విద్యార్థులు యూనిఫాం వేసుకురాకపోవడాన్ని గమనించి ఉపాధ్యాయులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భం ప్రత్యేకాధికారి మహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులంతా తప్పకుండా యూనిఫాం వేసుకుని పాఠశాలకు వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచి పేరయ్య, ఎంపీడీవో రమేష్‌బాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ నాగరాజు, కార్యదర్శి శేఖర్, సీడీపీవో లక్ష్మీభార్గవి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

వరద ఉధృతి పరిశీలన

వీరులపాడు: మండలంలోని పల్లెంపల్లి గ్రామ సమీపంలోని వైరా కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతోపాటు ఎగువ నుంచి వస్తున్న వరద నీటి కారణంగా వైరాకట్టలేరు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తోంది. అంతే కాకుండా కాజ్‌వేపై నుంచి మూడు నుంచి నాలుగు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుండటంతో తహసీల్దార్ రాజకిషోర్, ఎస్ఐ మహాలక్ష్మణుడు వరద ఉధృతిని పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అక్కడ రెవెన్యూ, పోలీసు సిబ్బందిని కాపలాగా ఉంచి వీరులపాడు–నందిగామ మండలాల మధ్య రాకపోకలను నిలుపుదల చేశారు. వైరాకట్టలేరుపై ఉన్న బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు అసంపూర్తిగా నిలిచిపోవడంతో వర్షాలు వచ్చిన సమయంలో వరద నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది.